# నిష్ణాతుడు

పి.వి. అయ్యర్



"ఇలా తేగేసి చెప్తున్నందుకు నన్ను క్షమించండి రాజన్. చాలా రిస్క్‌తో కూడుకున్న పనది" చెప్పేను.

"మిస్టర్ రోగర్!, నువ్వున్నదే రిస్క్‌తో కూడుకున్న వ్యాపారంలో" నే నాపని చెయ్యక తప్పదన్నట్లు పలికిందతని కంఠం.


"కావచ్చు, కానీ దాన్నుండీ వచ్చే ఇబ్బందుల్నించీ తప్పించుకోవడం నా వల్ల కాదు. మీకు డబ్బు అర్జెంట్ అంటున్నారు కాబట్టి మీకు తప్పకుండా హెల్ప్ చేస్తాను. కాకపోతే శ్రమంతా మీరే భరించాల్సి ఉంటుంది. మీకు ఏడేళ్ళ జైలు శిక్షే పడొచ్చు లేక....."

చెప్పుకుపోతూన్న నాకు అడ్డొస్తూ అన్నాడు రాజన్, "జోకు లెయ్యొద్దు, నీ వృత్తే ఫోర్జరీలు చెయ్యడం. అలాంటిది నువ్వే నాకు చట్టం న్యాయం గురించి బోధించాల్సిన పన్లేదు."

నేను దేన్నయితే వినడానికి ఇష్టప డనో దాన్నే కదిలించాడా వ్యక్తి. నాకో స్వంత ప్రింటింగు ప్రెస్సుంది. అద్భుతమయిన డిజైన్లు, అందమయిన వర్ణచిత్రాలూ..... అలాంటివే అధికంగా ప్రింట్ చేస్తూ ఉంటాను. నా దగ్గరకొచ్చే వాళ్ళల్లో అధికంగా పబ్లిషర్లూ, చిత్రకారులూ అప్పుడప్పుడూ బ్రతుకు బాట తప్పి చట్ట విరుద్ధంగా నడిచేవాళ్ళూ ఉంటారు.

ఈ దేశంలో పాస్‌పోర్టు లభించడం ఎంత కష్టమో అందరికీ తెల్సు. పోలీసు రికార్డుల్లో ఉన్న వాళ్ళ మాట దేవుడెరుగు, మర్యాదస్థులయిన పౌరులకు్కూడా పాస్‌పోర్ట్ దొరకాలంటే నెలలు పడుతుంది.

స్వేచ్ఛానువాదం: టి. చక్రపాణి




అలాంటప్పుడు మెడికల్ ట్రీట్‌మెంట్ అవసరమయిన వాళ్ళకూ, అర్జంటుగా విదేశాలకు వెళ్ళదలచుకున్న వాళ్ళకూ పాస్‌పోర్ట్స్ తయారు చేసి ఇస్తూంటాను.

ఈ వృత్తిలో నమ్మకమే అన్నీ. వాళ్ళక్కావల్సింది తయారు చేసివ్వడం, నాక్కావాల్సినంత ఫీజు తీసుకోవడం- అంతే, ఎటువంటి ఇబ్బంది కరమయిన ప్రశ్నలూ వెయ్యడం జరగదు. నా దగ్గర కొచ్చేవాళ్ళంతా నా గురించి ఒకరి నోటి ద్వారా మరొకరు విని వచ్చేవాళ్ళే. "ఇక్కడ అన్ని రకాల పాస్‌పోర్ట్‌లూ, వీసాలూ, అన్ని కాలేజీల సర్టిఫికెట్లూ తయారు చేసి ఇవ్వబడును" అంటూ · పేపర్లలో ప్రకటనలివ్వడం సాధ్యమయ్యే పనికాదు కదా. ఈ వృత్తిలో నమ్మకమే అవసరం అన్జెప్పటానికి ఇంతకంటే ఆధారం ఏంకావాలి.

సాధారణంగా నా దగ్గర కొచ్చే వాళ్ళంతా చాలా ఆతృతగానూ, నేనడిగినంత ఇచ్చేందుకు సిద్ధంగానూ ఉంటారు. కానీ ఈ వ్యక్తి మాత్రం అలాక్కాదు, ప్రస్తుతం ఇతను నన్నే శాసించే స్థితిలో ఉన్నాడు. పరిస్థితి మొత్తం అతడి చేతుల్లోనే ఉంది.

"మిస్టర్ రాజన్..... ఒకర్నొకరు అర్థం చేసుకుందాం. డ్రాఫ్టుల్ని ఫోర్జరీ చేసి మీకు పదిహేను లక్షలొచ్చేట్టుగా చూడమంటారు సరే. మీకు బ్యాంకు రూల్సన్నీ బాగా తెల్సని నాకు తెల్సు. ఫోర్జరీ చేసిన డ్రాఫ్టుల్ని మీరు కాష్ చేసుకోగల్గినా మోసం కొద్ది రోజుల్లోనే బయట పడక తప్పదు. అప్పుడు, మీరు సంపాయించిన డబ్బుని కనీసం ఖర్చుపెట్టడం కూడా మొదలెట్టక ముందే పోలీసులు మీ ఇంటి తలుపు తట్టక మానరు." నే చెప్పింది విని రాజన్ సీరియస్‌గా మారిపోయేడు, "మిస్టర్ రోగర్! , పదిహేను లక్షలకు డిమాండ్ డ్రాఫ్టు అదీ ·నీ పేరు మీద తయారు చేసి కాష్‌గా మార్చి ఇవ్వు. డబ్బు నా చేతికందగానే సింగపూర్ వెళ్ళిపోదల్చుకున్నాను. పోలీసులు నీ ఇంటి తలుపు తట్టినపుడు వాళ్ళనెలా మేనేజ్ చేస్తావో అదంతా నీ శ్రమ, అయితే - ...."

అతడి మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ చెప్పేను, "జోకులేసేందుకు ఇంతకంటే మంచి టైమేం దొరకలేదా మీకు?, మాట్లాడాల్సిందేమీ లేకపోతే అవతల నేను చూడాల్సిన పన్లు చాలా ఉన్నాయి, వెళ్తాను" నేను లేచి నిల్చోగానే, రాజన్ వేగంగా లేచి నాదారి కడ్డొచ్చేడు. "మిస్టర్ రోగర్! నా జీవితంలో నేనెప్పుడూ ఇంత సీరియస్‌గా ఉండలేదు. నాకా డబ్బు చాలా అవసరం. ఆ డబ్బందగానే ఈ దేశాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోతాను. సింగపూర్ బిజినెస్ సర్కిల్‌లో ఇండియన్ కరెన్సీకి వాల్యూ ఉండడం నా అదృష్టం. రోగర్! , నీ సహాయం నాకెంతో అవసరం. నాకా హెల్ప్ చేసిపెట్టినందుకు నీకో లక్ష రూపాయలిస్తాను. చెయ్యలేదనుకో......." మరో అడుగు ముందుకేసి నాకు మరింత దగ్గరగా వచ్చేడు రాజన్.

"రాజన్!, నన్ను భయపెట్టడం నువ్వనుకున్నంత సులభంకాదు. నీ సింగపూర్ ట్రిప్ సంగతి మర్చిపోవడం చాలా మంచిది" గట్టిగా ఊపిరి పీల్చుకుని చెప్పేను, "బేంక్‌ని మోసం చెయ్యడం నాకిష్టంలేదు, చేసే అవకాశమూలేదు. డబ్బు సంపాదించుకోడాన్కి నువ్వు మరో మార్గమేదయినా చూస్కోడం చాలా మంచిది."

ఏమనుకున్నాడోమరి, రాజన్ ప్రశాంతంగానే మాట్లాడేడు, "నిన్ను పదిహేనేళ్ళు జైల్లో నెట్టడానికి కావల్సినంత సమాచారం నా దగ్గరుంది. నీకో విషయం తెల్సో తెలీదో మరి, నీ పాత కస్టమర్లను చాలామందిని కల్సి నువ్వు ఫోర్జరీ చేసినవి సంపాయించేను. ఇంకో విషయం- నీ దగ్గరికి రెగ్యులర్‌గా వచ్చే కస్టమర్లలలో కొంతమంది కొద్దిపాటి డబ్బుకే నీకు వ్యతిరేకంగా సాక్ష్యమివ్వడానికి ఒప్పుకున్నారు. కాబట్టి..... నీ వృత్తి న్నువ్వు హాయిగా, ఎటువంటి ఆటంకాల్లేకుండా నడుపుకోవాలనుకుంటే నాకి సహాయం చేసి పెట్టకతప్పదు."

"అంటే, బ్లాక్‌మెయిలింగ్ అన్నమాట" చిన్నగా తలపంకించి చెప్పేను, "ఓ. కె! మన ప్లాన్ నెలా అమలు పరచాలో ఆలోచిద్దాం, కూర్చోండి" కుర్చీ చూయిస్తూ చెప్పేను.

"మీకు పదిహేను లక్షలు కదూ కావాలి. డ్రాఫ్టు విలువ పది లక్షలకంటే ఎక్కువుంటే డ్రాఫ్ట్ ఇచ్చిన బ్యాంకు డబ్బును చెల్లించే బ్యాంకుకు కొన్ని సీక్రెట్ కోడ్స్ పంపుతుంది. కాబట్టి ఎనిమిది లక్షలు, ఏడు లక్షలుగా రెండు డ్రాఫ్టులు తీద్దాం."

"ఆ వివరాలన్నీ నీకే వదిలేస్తున్నాను..... ఓ వారంలోగా డబ్బు నా చేతికి రావడమే నాక్కావల్సింది. "

కుర్చీలో వెనక్కి జారగిలబడి రిలాక్స్‌గా కళ్ళు మూసుకుంటూ చెప్పేడతను.

"తమరి దయ, అన్నట్టు, నాకో లక్షిస్తానన్నారే ఆ డబ్బు నా కిప్పుడే కావాలి."

"ఆ పదిహేను లక్షల్లోంచీ నీక్కావల్సిన లక్షా తీసుకోవచ్చు."

"హు. పదిహేను లక్షల్నే మోసంతో విత్‌డ్రా చేస్తున్నప్పుడు మరో లక్ష మోసం చెయ్యలేకనా.... ఈడియట్" కసిగా రాజన్ని మనసులోనే తిట్టుకున్నాను.

"మిస్టర్ రాజన్! , ముందు నేనెవరో పరిచయంలేని ప్రాంతాల్లో రెండు బ్యాంకుల్లో కరెంట్ అకౌంట్స్ తెరవాలి. నేనో విలువయిన ఖాతాదారునని బ్యాంకు వాళ్ళు నమ్మేందుకు రెండు అకౌంట్స్‌లోనూ యాభైవేలు చొప్పున వేసుంచాల్సిందే. వందరూపాయలకు అకౌంట్ ఓపెన్ చేసి పదిలక్షలకు డ్రాఫ్ట్ విత్‌డ్రా చేస్తే బ్యాంకులకు అనుమానం వస్తుంది."

ఒక్కక్షణం అతను నావంక చూసి చెప్పేడు, "సరే, నీపేరిట తొంభైవేలు

బ్యేంకుల్లో వేయడానికి ఒప్పుకుంటున్నాను. లక్షలు వచ్చేందుకు వేలు ఖర్చు పెట్టడంలో తప్పేంలేదు."

"గుడ్!, నీక్కూడా ఆలోచన ఉందే" నవ్వుతూ అన్నాను. "నేనెప్పుడూ ఆలోచనల్లోనే ఉంటాను రోగర్. నీ పేరిట తొంభైవేలు బ్యాంకులో వేసేందుకు రడీగా ఉన్నాను. నువ్వు ఏ రకమయిన మోసానికి ప్రయత్నించినా ఈ జన్మకు ప్రింటింగు ప్రెస్సు మొహాన్ని చూడ్లేవు." రాజ్యాన్ని ఈడ్చికొట్టాలన్నంత కోపం కల్గినా తమాయించుకున్నాను.

అయిదు వందల రూపాయల నోట్ల దొంతి లెక్కపెట్టి నా చేతికందించేడు.

"వచ్చే శుక్రవారానికంతా పని పూర్తయ్యేట్లు చూడు. డబ్బు చేతికందిన మధ్యాహ్నమే సింగపూర్ వెళ్ళిపోవడానికి అన్నీ రడీగా ఉంచేను."

"అనవసరంగా టెన్షన్‌కు గురికాకండి రాజన్. మీరు హాయిగా విశ్రాంతి తీసుకోండి. వచ్చే శుక్రవారం ఉదయం పదకొండు గంటలకంతా డబ్బు మీ చేతికందుతుంది."

వెళ్లబోతుంటే ఆపి చెప్పేను, "నా కష్టమర్లకు ఇబ్బంది కలిగించకండి రాజన్. అది నా బిజినెస్‌కు ఇబ్బంది కలిగిస్తుంది."

నేనన్న మాటలకు అతడి పెదాలు చిర్నవ్వుతో చిన్నగా విచ్చుకున్నాయి.

"ఏదో నా పని గడవాలని నిన్ను బెదిరిస్తున్నానే తప్ప బ్లాక్‌మెయిలింగ్ నా వృత్తి కాదు రోగర్."

అతను నా ఆఫీస్‌లోంచి వెళ్ళిపోయాడు.

ఈ కొత్త కష్టమర్ గురించి వీలయినంత సమాచారం వీలయినంత వేగంగా సంపాదించాలనిపించింది. పోలీసులు అతడి కోసం ఆర్నెల్లుగా వెతుకుతున్నట్టూ, ఇతడికి డబ్బు సమస్య వచ్చినందువల్లే నా మీద పడ్డాడనీ తెల్సుకోగలిగేను. శుక్రవారం రాజన్ సింగపూర్ గనుక చేరగల్గితే ఆ తరువాత అతను పోలీసులకు దొరకడం అబద్ధం అని నాకు తెల్సు, ఎందుకంటే సింగపూర్ నుండీ అతను ఇండియాకు తిరిగొచ్చే సూచనలెట్టి పరిస్థితుల్లోనూ నాక్కనిపించట్లేదు.

రాజన్ పనిని పూర్తి చెయ్యడంలో మునిగిపోయేను. ఎందుకో నేనేదయినా పని ఒప్పుకొన్న తర్వాత లోపాల్లేకుండా పూర్తి చెయ్యడమే నా పద్ధతి.

శుక్రవారం సరిగ్గా గడియారం పదకొండు గంటలుకొట్టగానే రాజన్ నా ఆఫీసులోకి అడుగుపెట్టేడు. లోనికడుగు పడుతూండగానే పనిపూర్తయిన సంగతి గ్రహించేడతను.

"నోట్లన్నీ అయిదువందలే కావడం నీ అదృష్టం రాజన్" చిన్నగా నవ్వుతూ చెప్పేనతడికి.

"ఐయామ్ సారీ మిస్టర్ రోగర్. ఆ రోజు మిమ్మల్నినవసరంగా బాధపెట్టేను. మీ ప్రొఫెషన్‌లో మీకున్న ప్రతిభని మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నాను" నా భుజం తడ్తూ చెప్పేడు రాజన్.

"థాంక్యూ వెరీమచ్ మిస్టర్ రాజన్" నా గొంతుని మామూలుగా పలికించడానికి ప్రయత్నిస్తూ చెప్పేను.

నా ప్రతిభను నేనేమేరకు ఉపయోగించుకున్నానో అర్థం చేసుకునే పొజిషన్‌లో అతను లేడు. వెంటనే సింగపూర్ చేరుకోవాలనే తొందర్లో ఉన్నాడతను. తనకోసం బయట వెయిట్ చేస్తూన్న ట్యాక్సీ ఎక్కి చిద్విలాసంగా ఎయిర్ పోర్ట్‌కు వెళ్ళిపోయేడు.

రాజన్ అంటే నాకు నచ్చకపోయినా, సింగపూర్ షాప్‌కీపర్స్ అసలు సిసలు ఇండియన్ కరెన్సీకి, నేను ముద్రించిన రాజన్ చేతిలోని నకిలీ కరెన్సీకి తేడా కనుక్కోగలరా లేదా అని టెస్ట్ చేద్దామనిపించింది.

కనుక్కోలేరనే అనుకుంటున్నాను. ఎందుకంటే, నా నైపుణ్యం మీద నాకు నమ్మకముంది.

---

# ఒంటికన్ను భూతం!

పిల్లలూ! పిల్లలూ!
తల్లి ఒడిలాంటి తోట
ఎక్కడుందో చెప్పరూ?
యశోదా కృష్ణుల గాథలు
ఏం విన్నారో వినిపించరూ?
కన్నా! కన్నా!
ఒంటి కన్ను రాక్షసుడిలా
రైలుబండి కౌగిలించిందా?

ఓ లేత పాపాయిల్లారా!
ఛుక్‌ఛుక్ రైలు కెందుకు
మీమీద ఇంత ఇనుప ప్రేమ
రాముా, రాజూ జుట్టు పట్టుకొని
జగడం ఆడుకుంటుంటే
నిర్దాక్షిణ్యంగా విడదీయడానికొచ్చిందా?
అసహ్యాద్రి ఎక్స్‌ప్రెస్

మృత్యువులో మిమ్మల్ని కలిపి
ఒకరి వెంట ఒకర్ని
ఏ సహ్యాద్రి కొండలవైపు నడిపించింది?
పట్టపగలే ఏ కొండమీద
చంద్రుణ్ణే పట్టుకోబోయారు చిన్నారులూ?
ఈ ప్రపంచాన్నే కాలదన్నేశారు?!

సాదనాల వెంకట స్వామి నాయుడు

